క్లుప్తంగా

టీడీపీ ఆవిర్భావ దినోత్సవం



గురజాల: తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు శనివారం స్థానిక టీడీపీ పార్టీ కార్యాలయంలో మండల కన్వీనర్ జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. పార్టీ జెండాను ఆవిష్కరించి, పులిహోర పంపిణీ చేశారు. పులుకూరి కాంతరావు, జినగా దావీదు, కోయా పుల్లారావు, చింతకాయల దానయ్య తదితరులున్నారు.

వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

- నేడు ఉగాది పండగ .. అర్చనలు



మాచర్ల: పట్టణంలోని బస్టాండ్ సెంటర్‌లో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి దేవాలయంలో తెల్లవారు ఝాము నుంచి అర్చకులు అడిగొప్పల చెన్నకేశవాచార్యులు, దేవాలయ కమిటీ నిర్వాహకులు బోయ రామిరెడ్డి, బండ్ల వెంకటేశ్వర్లు, రమణారెడ్డితో పాటు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అర్చన కార్యక్రమాలు నిర్వహించారు. వందలాది మంది భక్తులు స్వామి వారిని దర్శించుకొని, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఉగాది పండుగ పురస్కరించుకొని ఆదివారం తెల్లవారు ఝాము నుంచి రాత్రి వరకు స్వామి వారికి అర్చన, అభిషేకాలతో పాటు వివిధ కార్యక్రమాలను నిర్వహించారు.

ఫ్యాప్టో చైర్మన్ వెంకట్రామిరెడ్డికి సన్మానం

దాచేపల్లి : ఫ్యాప్టో జిల్లా చైర్మన్(ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య) లింగిరెడ్డి వెంకట్రామిరెడ్డిని శనివారం సన్మానించారు. మండలంలోని తంగెడ ప్రభుత్వ మెయిన్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న వెంకట్రామిరెడ్డిని ఫ్యాప్టో చైర్మన్‌గా ఇటీవల ఎన్నుకున్నారు. ఎంఈవో పినాకపాణి, ముత్యాలంపాడు హైస్కూల్ హెచ్‌ఎం బళ్లా మేరిశ్యాంకుమారి, ఉపాధ్యాయులు లంకె వాసుదేవరావు, అజయ్‌కుమార్ తదితరులు శాలువా, పూలదండలతో వెంకట్రామిరెడ్డిని సన్మానించి అభినందించారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తాని ఆయన చెప్పారు. ఉపాధ్యాయులు వాణిశ్రీ, షౌకత్ ఉన్నీషా, శారదా, జయలక్ష్మీ, సీత, గౌతమి, నాగలక్ష్మీ, సుభాషిణీ, సలావుద్దీన్ పాల్గొన్నారు.

వెట్టిచాకిరిని నిర్మూలించాలి



పిడుగురాళ్ల: వెట్టి చాకిరి 1975లో నిషేధించినప్పటికి ఇంకా కొనసాగుతుందని, దానిని నిర్మూలించాల్సిన అవసరం ఉందని కార్డ్స్ సంస్థ వ్యవస్థాపకుడు ఎం.స్వర్ణలతాదేవి అన్నారు. పట్టణంలోని లెనిన్ నగర్‌లోని కార్డ్స్ స్కూల్ కార్డ్స్ సంస్థ డిప్యూటీ డైరెక్టర్ తాళ్లూరి అమర్‌నాథ్ అధ్యక్షతన వెట్టిచాకిరి, బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... బాల కార్మికుల వ్యవస్థను రూపు మాపి, స్కూల్‌ల్లో చేరే విధంగా చూడాలన్నారు. నిర్బంధ విద్య, వైద్యం ఉచ్చితంగా అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది రూత్ బనియన్, హ్యూమన్ రైట్స్ డివిజన్ అధ్యక్షులు తాళ్లూరి సారిబాబు, అంబేద్కర్ సేవా సమితి అధ్యక్షులు డేగల అబ్రహాం, చిలకా కోటేశ్వరరావు, బి. జీవారత్నం, కార్డ్స్ డైరెక్టర్ కె. మేరి, ఐసీడీఎస్ అంగన్‌వాడీ టీచర్లు, డిప్యూటీ డైరెక్టర్ అనిత, స్కూల్ హెచ్‌ఎం లత పాల్గొన్నారు.

ఎస్సీ సెల్ సంయుక్త కార్యదర్శిగా సుందరరావు



మాచర్ల : మాచర్ల సుందరరావును వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ విభాగ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా ఎంపిక చేసినట్లు పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నియామక పత్రం పొందిన సుందరరావు మాట్లాడుతూ తన పై ఎంతో నమ్మకముంచి మాజీ సీఎం జగన్, పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి తనకు ఉన్నత పదవిని కేటాయించడం ఎంతో సంతోషకరమన్నారు.

పనిచేయని బయోమెట్రిక్

నాదెండ్ల: గణపవరం ఒకటో సచివాలయంలో ఆధార్ అప్‌డేట్ సెంటర్ ద్వారా కార్డు అప్‌డేట్ సేవలందించారు. అయితే సర్వర్ల మొరాయింపుతో బయోమెట్రిక్ పనిచేయకపోవటంతో కార్డుదారులకు అవస్థలు తప్పలేదు.

మాచర్ల రైల్వే స్టేషన్‌కు మహర్దశ

- అమృత భారత్ పథకానికి ఎంపిక
- రూ. 9 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు
- మారుతున్న స్టేషన్ రూపురేఖలు
- నూతన భవనాలు, ప్లాట్‌ఫాంల ఏర్పాటు
- వాహనాల పార్కింగ్, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు
- రద్దీ సమయంలో రైళ్ల ఏర్పాటుకు వినతి



మాచర్ల రైల్వే స్టేషన్

మాచర్ల రూరల్: మాచర్ల పట్టణ రైల్వేస్టేషన్ రూపురేఖలు మారుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అమృత భారత్ పథకంలో భాగంగా రూ.9 కోట్లతో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయి. రైల్వే శాఖ ప్రయాణికుల సౌకర్యార్థం ఆధునీకీకరణ పనులను చేపడుతోంది. ఏడు దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన రైల్వే స్టేషన్ నుంచి నాపరాయి, కేసీపీ ఫ్యాక్టరీ నుంచి సిమెంట్, కోల్‌కతాకు చేపలు, మిర్చి, పత్తి వంటి పంటలను ఎగుమతి చేస్తూ, బొగ్గు, ఎరువులు దిగుమతి చేసుకునేవారు. క్రమక్రమంగా నాపరాయి డిమాండ్ తగ్గడంతో రవాణాకు అంతరాయం కలిగింది. సిమెంట్, మిర్చి, పత్తి పంటలను లారీల ద్వారా రవాణా చేస్తుండటంతో ప్రస్తుతం ప్రయాణికులతోనే రైల్వే రాకపోకలు నెలకొన్నాయి. దశాబ్దాల క్రితం నిర్మించిన రైల్వే స్టేషన్‌లో ప్లాట్‌ఫాంల పెంపు, నూతన భవనాల నిర్మితం తప్పితే ఎటువంటి అభివృద్ధికి పనులు నోచుకోలేదు.

అమృత భారత్‌లో అభివృద్ధి..

అమృత భారత్ పథకం ద్వారా రూ.9కోట్లు మాచర్ల స్టేషన్‌కు మంజూరయ్యాయి. ఈ నిధులతో పాత భవనాలను పూర్తిగా తొలగించి, భవనాలను నిర్మిస్తున్నారు. అలాగే ప్లాట్‌ఫాం పొడవును పెంచి ప్రయాణికులకు సౌకర్యాలు కల్పిస్తున్నారు. స్టేషన్ బయట ఇరు వైపులా వాహనాలు నిలిపేందుకు పెద్ద ఫ్లాట్ ఫామ్‌లు ఏర్పాటు చేసి, బస్సు, ఆటో, ద్విచక్ర వాహనాల ఫ్లాట్ ఫాంతో పాటు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేస్తున్నారు. ఇవన్నీ పూర్తయితే మాచర్ల రైల్వే స్టేషన్ రూపురేఖలు మారుతాయనడంలో ఎలాంటి సందేహం లేదు.

ఎక్స్‌ప్రెస్, ప్యాసింజర్‌కు అదనపు బోగీల డిమాండ్

పల్నాడు జిల్లాకు చివరన ఉండి, ఆర్థికకంగా వెనుకబాటుతనాన్ని ఎదుర్కొంటున్న మాచర్ల ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించడంలో రైల్వే శాఖ ప్రత్యేక దృష్టి సారించాలి. ఉదయం 5.30 గంటలకు విజయవాడకు, సాయంత్రం 4.30 గంటలకు గుంటూరుకు వెళ్లాలంటే రెండు రైళ్లు తప్పితే ఇతర ఏ మార్గం లేదు. రోజుకు సుమారు 1000 మంది మాచర్ల, గురజాల నుంచి గుంటూరు, విజయవాడకు ప్రయాణిస్తుంటారు. రైళ్ల బోగీలు సరిపోక గుంటూరు వరకు నిలుచొని ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంటోంది. దీనిని దృష్టిలో ఉంచుకొని ఉన్న 8 బోగీలకు అదనంగా మరొక నాలుగు బోగీలు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఎక్స్‌ప్రెస్ రైలు

గుంటూరు వెళ్లేందుకు ఉదయం 5.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు వరకు ఎటువంటి రైలు లేక ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఉదయం 9 గంటలకు మధ్యలో మాచర్ల నుంచి ఎక్స్‌ప్రెస్ రైలును నడిపితే ప్రయాణికులకు సౌకర్యంగా ఉంటుంది. నిత్యం వేలాది మంది వ్యాపారులు, వృద్ధులు వివిధ పనుల నిమిత్తం, వైద్యశాలలకు గుంటూరు, విజయవాడకు ప్రయాణిస్తుంటారు. ఉదయం రైలుకు సమయానికి అందుకోకపోతే వారు సాయంత్రం వరకు వేచి ఉండాల్సిన పరిస్థితి ఉంటుంది. గతంలో ఎక్స్‌ప్రెస్ రైలు నడపాలని ఎన్నో మార్లు వినతి పత్రాలు అందించిన సమయంలో పరిశీలన చేస్తామని చెప్పిన అధికారులు వాటిని పట్టించుకోలేదు. పట్టణంలో పెరుగుతున్న జనాభా, సౌకర్యాలతో పాటు అదనపు రైళ్లను ఏర్పాటు చేస్తే.. ఈ ప్రాంత ప్రజలకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుంది.



స్టేషన్ బయట సెంట్రల్ లైటింగ్



రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాం పై షెడ్ల నిర్మాణం

ముందస్తు ఉగాది వేడుకలు



కృష్ణవేణి టాలెంట్ స్కూల్ ఉగాది వేడుకల్లో విద్యార్థులు



బోధి పాఠశాలలో ఉగాది వేడుకలు

మాచర్ల: ముందస్తు ఉగాది పండుగ వేడుకలను పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్, నారాయణ,కిడ్స్ స్కూళ్లు, పల్నాడు జూనియర్, కృష్ణవేణి జూనియర్ కాలేజీల్లో శనివారం నిర్వహించారు. విద్యా సంస్థల నిర్వాహకులు డాక్టర్ శివ, పఠాన్ నాగూర్‌వలి, ఉల్లా రెడ్డి, వై.వెంకట్రామయ్యతో కొత్త సంవత్సరానికి స్వాగతం పలికారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పలు కార్యక్రమాలు నిర్వహించారు.

వేడుకగా ముందస్తు ఉగాది

పిడుగురాళ్ల: మండలంలోని తుమ్మలచరువు గ్రామంలోని బోధి పాఠశాలలో శనివారం ముందస్తు ఉగాది, రంజాన్ పండగలను నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో నృత్యాలు, పాటలు, నాటకాలు ప్రదర్శించి సంబరాలు చేసుకున్నారు.కరస్పాండెంట్ సునీతారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు సాంప్రదాయలపై గౌరవం పెరిగే విధంగా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, విద్యాలయాలపై ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ భాస్కర్‌రెడ్డి, డైరెక్టర్ కల్యాణ్‌రామ్ పాల్గొన్నారు.

చెంచుల నివాస ప్రాంతాల్లో రేషన్ పంపిణీ చేయాలి

మాచర్ల: నాగులవరం పంచాయితీ పరిధిలో గిరిజనులు చెంచుకాలని, పెద్ద అనుపు నుంచి 3 కి.మీలు బెల్లంకొండపాలెం వెళ్లి బియ్యం తెచ్చుకోవాల్సి వస్తుందని జిల్లా గిరిజన సమైఖ్య అధ్యక్షులు సూన్నావత్ రంగా నాయక్ తెలిపారు. శనివారం చెంచుకాలని, పెద్ద అనుపునకు సంబంధించిన వారితో కలిసి మాచర్ల తహసీల్దార్ డి.కిరణ్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుగాలీలు, చెంచులు తమకు రేషన్ వాహనం రాక మరో వైపు, ఊరిలో రేషన్ షాపు లేక బెల్లంకొండవారి పాలెం గ్రామానికి వెళ్లి తెచ్చుకుంటున్నారని తెలిపారు. గిరిజనులకు న్యాయం చేసేలా పరిసర ప్రాంతాలలో రేషన్ అందించాలన్నారు. తహసీల్దార్ స్పందించి, ఇందుకు స్పందించి చర్యలు తీసుకుంటామన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న రంగా నాయక్

తాగునీటి చెరువు పరిశీలన

నాదెండ్ల: గణపవరం రక్షిత మంచినీటి చెరువులో నీటి నిల్వలను ఎన్ఎస్‌పీ, అధికారులు, సచివాలయ సిబ్బంది శనివారం పరిశీలించారు. చెరువు పూర్తిగా అడుగంటటంతో ఈ నెల 22, 23, 24 తేదిల్లో సాగర్ జలాలతో నింపారు. అయితే కేవలం 20 శాతం మాత్రమే చెరువు నిండింది. ప్రస్తుతం నిల్వ ఉన్న నీరు ఏప్రియల్ చివరి వరకూ మాత్రమే తాగునీటి అవసరాలకు సరిపోతాయి. ప్రస్తుతం సాగర్‌జలాలు వారాబందీ ద్వారా విడుదలౌతున్న నేపథ్యంలో కొందరు రైతులు పంటపొలాలకు మళ్లించుకుంటున్నందున పహారా కాస్తున్నట్లు ఎన్ఎస్‌పీ ఏఈ మురళీకృష్ణ తెలిపారు. ఏప్రిల్ చివరిలో మరోసారి సాగర్ జలాలు విడుదల చేయనున్న నేపథ్యంలో చెరువుకు పూర్తిస్థాయిలో నీరు నింపనున్నట్లు అధికారులు తెలిపారు. వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మారుతీ బాబు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.



గణపవరం తాగునీటి చెరువులో నీటినిల్వలు పరిశీలిస్తున్న ఎన్ఎస్‌పీ అధికారులు

పోక్సో చట్టంతో బాలలకు భద్రత

- చిలకలూరిపేట మండల సేవా అధికార సంస్థ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి
- చట్టంపై న్యాయ విజ్ఞాన సదస్సు



మాట్లాడుతున్న కె.నరేందర్‌రెడ్డి

యడ్లపాడు: మండల కేంద్రమైన యడ్లపాడు గ్రామ సచివాలయంలో శనివారం పోక్సో చట్టంపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని చిలకలూరిపేట మండల సేవా అధికార సంస్థ చైర్మన్, ప్రిన్సిపల్ జడ్జి (జూనియర్ డివిజన్) కె.నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టారు. సదస్సులో పోక్సో (ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్ ఫ్రం సెక్సువల్ ఆఫెన్సెస్) చట్టం-2012పై అవగాహన కల్పించారు. 18 సంవత్సరాలలోపు పిల్లలపై లైంగిక వేధింపులు, అశ్లీలత వంటి నేరాల నివారణ, బాధితుల గోప్యతను పాటించడం, ఈ చట్టంలోని శిక్ష నిబంధనలు తదితర అంశాలపై వివరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు పి. వెంకటేశ్వర రావు, జీవీహెచ్ఎస్ ప్రసాద్, టి.రామాంజనేయులు, ఎం భానుప్రసాద్, పారా లీగల్ వలంటీర్స్, పంచాయతీ కార్యదర్శులు, ఏటీఎం, పోలీసులు, మహిళలు పాల్గొన్నారు.

ఆటో బోల్తా - ఇద్దరికి గాయాలు

నాదెండ్ల: జాతీయ రహదారిపై గణపవరం కుప్పగంజి వాగు బ్రిడ్జిపై ఆటో బోల్తాపడిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. రోడ్డుపై వెళ్తున్న కారు ఆగటంతో వెనుక వస్తున్న ఆటో డ్రైవర్ ఒక్కసారిగా బ్రేక్ వేశాడు. దీంతో ఆటో అదుపుతప్పి రోడ్డుపై బోల్తాపడింది. ఆటోలో ప్రయాణిస్తున్న గణపవరం గ్రామానికి చెందిన డ్రైవర్ నాగేశ్వరరావు, అతని మిత్రుడిని స్థానికులు ఆటోలో నుండి వెలుపలికి తీశారు.

కొత్త ఏడాది మున్సిపల్ అభివృద్ధికి కృషి చేద్దాం

పురపాలక సంఘ చైర్మన్ పోలూరి నరసింహరావు



మాచర్ల: తెలుగు సంవత్సరాది ఉగాది సంవత్సరం నుంచి పూర్తిస్థాయిలో మరింత పురపాలక సంఘ అభివృద్ధికి సమష్టిగా కృషి చేసి, మౌలిక సదుపాయాలు కల్పించి ప్రజల ఆమోదం పొందడానికి కలిసికట్టుగా పనిచేద్దామని పురపాలక సంఘ చైర్మన్ పోలూరి నరసింహారావు పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని పురపాలక సంఘ సాధారణ సమావేశం చైర్మన్ అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ హాలులో జరిగింది. మొత్తం 8 అంశాలు ప్రవేశపెట్టగా ప్రతి అంశం పై మాట్లాడి ఏకగ్రీవంగా ఆమోదించారు. పీఎస్ఆర్ ఆంజనేయులు మీనాక్షి, రోటరీ, లయన్స్ విజన్ చారిటబుల్ ట్రస్టు ఆసుపత్రికి పన్నులకు సంబంధించి రూ.22లక్షల మినహాయింపు, మెట్టు గోవిందరెడ్డి స్వామి వివేకానంద చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించే బిల్డింగ్ అనుమతులు, 15, 30 వార్డులో నూతనంగా చేపట్టేందుకు అవసరమైన పని అంతకుముందే అనుమతులిచ్చామని, అనుమతులిచ్చినందువలన దానిని వాయిదా వేయాలని కౌన్సిలర్ షేక్ సుభాని కోరారు. ఈ మూడు అంశాలకు సంబంధించి వచ్చే కౌన్సిల్‌లో నిర్ణయం తీసుకునేలా చర్చ జరిగింది. ఎండాకాలంలో చలివేంద్రాలకు సంబంధించి ఏర్పాటు చేసే చలివేంద్రాలను పూర్తి స్థాయిలో ప్రజలకు ఉపయోగపడేలా రూ. 2 లక్షల బడ్జెట్ సరిపోదని, మరింతగా పెంచాలని కౌన్సిలర్లు ఎం.శ్రీనివాసరావు, గట్ల అరుణ కుమారి, షేక్ సుభాని కోరారు. పరిస్థితులను బట్టి నిర్ణయాలు తీసుకుంటామని చైర్మన్ నరసింహారావు సమాధానం ఇచ్చారు. అదే విధంగా గతంలో కోవిడ్‌లో చేరి దాదాపుగా సంవత్సరం పైగా వేతనాలు రాని 28 మంది కాంట్రాక్టు బేస్ వర్కర్లకు వేతనాలు చెల్లించేందుకు కౌన్సిల్ లో చర్చ జరిగింది. కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరికి న్యాయం చేయడానికే కౌన్సిల్ చర్యలు తీసుకుంటుందన్నారు. అంబేద్కర్ పార్కు అభివృద్ధికి, జయంతి సందర్భంగా రూ. లక్ష కేటాయించి, చెట్లు నాటి, పార్కు అభివృద్ధి చేసి రంగులు వేసేందుకు సాధారణ ఖర్చుల నుంచి అనుమతించారు. అదే విధంగా నూతనంగా 25 మంది కాంట్రాక్టు బేస్‌లో సంవత్సరం పాటు నాన్ పీహెచ్ వర్కర్లు, పబ్లిక్ హెల్త్ వర్కర్లు తీసుకునే విధంగా తీర్మానం చేశారు. కౌన్సిలర్లు పోలా శ్రీనివాసరావు, గట్ల అరుణ కుమారి, శ్యామలా జ్యోతి, ఎం.శ్రీనివాసరావు, తేరాల సిద్దమ్మ, షేక్ దస్తగిరి, గెల్లెపోగు జగన్నాధం, పురపాలక సంఘ అధికారులు డీఈ షేక్ సుభాని, ఏఈ గౌతమి, విద్యుత్ శాఖ ఏఈ కోటేశ్వరరావు, ఆర్‌ఓ సాంబశివరావు, ఆర్‌ఐ వెంగయ్య, మెప్మా ప్రాజెక్టు తరపున సీఓ రాజశేఖర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

పండగలకు సౌకర్యాలు కల్పించండి

మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో కౌన్సిలర్లు

పిడుగురాళ్ల: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు అధ్యక్షతన జరిగింది. శ్రీరామ నవమి సందర్భంగా పట్టణంలో చలువ పందిళ్ల ఏర్పాటు చేయాలని 23వ వార్డు కౌన్సిలర్ జూలకంటి శ్రీరంగ రజని కౌన్సిల్ దృష్టికి తీసుకొని వచ్చారు. రంజాన్ పండగను సందర్భంగా ఈద్గాలలో టెంట్లు, మంచినీటితోపాటు నమాజ్ చెదువుకునేందుకు సౌకర్యాలు కల్పించాలని ముస్లిం కౌన్సిలర్లు కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చారు. అధికారులు స్పందించి ఏర్పాట్లు చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటామని సూచించారు. చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు మాట్లాడుతూ పట్టణంలోని అన్ని వార్డుల అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. వేసవిలో నీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. అలాగే పట్టణాభివృద్ధి కోసం తగిన చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. మున్సిపల్ కౌన్సిల్ సమావేశం జరిగే సమయంలో గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్, కౌన్సిలర్లకు అందరికి ఉగాది, రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే పట్టణాభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానని తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్‌లు, మున్సిపల్ కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

నేడు వాసవి మాత ఆలయంలో పంచాంగ శ్రవణం

రెంటచింతల: ఉగాది పర్వదినం సందర్భంగా స్థానిక శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో ఆదివారం శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది పంచాంగ శ్రవణం ఉంటుందని దేవస్థానం అధ్యక్షుడు కట్టమూరి వెంకట నాగేశ్వరరావు తెలిపారు. శనివారం దేవస్థానంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉగాది పండగరోజు గ్రామ ప్రజలు ఉదయం దేవాలయానికి విచ్చేసి ఉగాది ప్రసాదం స్వీకరించాలని కోరారు. సాయంత్రం శ్రీ సాగి విశ్వేశ్వరరావు మాష్టర్ నిర్వహించే పంచాంగ శ్రవణంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని, తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

ఉపాధ్యాయుడికి ఉగాది సాహిత్య పురస్కారం



కొసూరి రవికుమార్

దాచేపల్లి : స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న కవి కొసూరి రవికుమార్ ఉగాది సాహిత్య పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ మేరకు అధికారుల నుంచి రవికుమార్‌కి సమాచారం అందింది. ఆదివారం జరిగే ఉగాది పండుగ వేడుకల్లో ఈ పురస్కారం రవికుమార్‌కి ప్రదానం చేస్తారు. ఉగాది సాహిత్య పురస్కారానికి రవికుమార్ ఎంపిక కావడంపై ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

బీసీ కార్పొరేషన్ రుణ మేళా



రుణమేళాలో దరఖాస్తులు స్వీకరిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

నరసరావుపేట రూరల్: మండల పరిషత్ కార్యాలయంలో శనివారం బీసీ కార్పొరేషన్ రుణ మేళ నిర్వహించారు. బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలు పొందేందుకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు రుణ మేళాకు హాజరయ్యారు. నరసరావుపేట ఇండియన్ బ్యాంక్, ఉప్పలపాడు, జొన్నలగడ్డ చైతన్య గోదావరి బ్యాంక్, రావిపాడు యూనియన్ బ్యాంక్, పమిడిపాడు బ్యాంక్ ఆఫ్ బరోడా అధికారులు లబ్ధిదారుల దరఖాస్తులను స్వీకరించారు. రుణ మేళాలలో 240 దరఖాస్తులు అధికారులకు అందాయి. సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలను ప్రోత్సహించి స్వయం ఉపాధి కల్పించడంలో భాగంగా వెనుకబడిన తరగతులు, కాపు, ఇతర కులాల వారికి రుణ మేళా నిర్వహించినట్టు ఎంపీడీవో టీవీ కృష్ణ కుమారి తెలిపారు. ఈవోపీఆర్‌డీ నాగానంద్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది రుణ మేళాలో పాల్గొన్నారు.

టీఈసీలో 58 మందికి ఉద్యోగాలు

నరసరావుపేట రూరల్: తిరుమల ఇంజినీరింగ్ కళాశాలలో చెన్నైకి చెందిన ఆల్సెక్ టెక్నాలజీస్ సంస్థ ప్రాంగణ ఎంపికలు నిర్వహించి 58 మంది విద్యార్థులను ఉద్యోగాలకు ఎంపిక చేసినట్టు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వైవీ నారాయణ తెలిపారు. శనివారం కళాశాల ప్రాంగణంలో కంపెనీ ప్రతినిధులు నిర్వహించిన ప్రాంగణ ఎంపికలకు వివిధ బ్రాంచ్‌లు నుంచి 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు. గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహించి 58 మంది విద్యార్థులను ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులకు రూ.2.40 లక్షల వార్షిక వేతనం లభిస్తుందని ప్రిన్సిపల్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల చైర్మన్ బొల్లా బ్రహ్మనాయుడు, కార్యదర్శి రావెల సత్యనారాయణ, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఎం.సాంబశివరావు అభినందించారు.

• చేతికందింది



కారెంపూడిలో నిల్వ చేసిన కందుల బస్తాలు



ఒప్పిచర్లలో కందులను తూర్పార పోస్తున్న రైతులు

కారెంపూడి: కంది పంట కోతలు మొదలయ్యాయి. పంట ఇంటికి చేరింది. గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు పంటను ఇళ్లల్లోనే నిల్వ చేసుకుంటున్నారు. వసతి లేని రైతులు ఇళ్లను అద్దెకు తీసుకుంటున్నారు. ఇప్పటి వరకు కందులు ఇంటికి చేరగానే వెంటనే వ్యాపారులు కొనుగోలు చేసేశారు. కానీ, ఇప్పుడు ఎన్నడూ లేని విధంగా కందులు కల్లాల్లోనే రోజులు తరబడి ఉంటున్నాయి. వాటిని ఆరబెట్టి, అట్టెడపట్టి, వ్యర్థాలన్నీ తొలగించి సరుకు శుభ్రం చేసినా కొనడానికి వ్యాపారులు ముందుకు రావడం లేదు. కందుల ధర క్వింటా రూ.6వేలకు పరిమితం చేయాలని వ్యాపారుల సిండికేట్ ప్రయత్నిస్తోంది. ఎరువు, పురుగు మందుల దుకాణాల వ్యాపారులు మాత్రం అప్పు కింద పంటను తప్పనిసరై కొంటున్నారు. వారు కూడా క్వింటా రూ.6,500 మించి ఇవ్వడం లేదు. కల్లం చేయిస్తే ఎకరాకు రూ.12 వేలు ఖర్చు అవుతోందని రైతులు హార్వెస్టర్లతో పంట కోయిస్తున్నారు. అట్టెడ పట్టడానికి క్వింటాకు రూ.150, వాటిని గోతాలకు పట్టి ఇళ్లు చేర్చడానికి బస్తాకు మరో రూ.50 అదనంగా ఖర్చులు అవుతున్నాయి. మండలంలో రబీ కంది మూడు వేల ఎకరాల్లో సాగు చేశారు. ఈ లెక్కన 18 వేల క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటికి మూడు వేల క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేశారు. క్వింటా రూ. 7,550 చెల్లిస్తున్నారు. ఇప్పుడు ఈ రేటు అయినా దక్కితే చాలని రైతులు కొనుగోలు కేంద్రాల వైపు చూస్తున్నారు. కానీ, ఈ-క్రాప్ బుకింగ్ లేకపోవడం పంట అమ్ముకోడానికి ఇబ్బందులొస్తున్నాయి. రైతు సేవా కేంద్రాలలో కంది పంట వేసిన రైతులు పేర్లు నమోదు చేసుకోడానికి కూడా క్షేత్రస్థాయిలో సమస్యలు తలెత్తుతున్నాయి.



కంది కోస్తున్న హార్వెస్టర్

గామాలపాడులో ఇఫ్తార్ విందు

దాచేపల్లి: మండలంలోని గామాలపాడులోని మహ్మదీయ మసీద్‌లో శనివారం రాత్రి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. అంజుమన్ కమిటీ అధ్యక్షుడు మౌలానా ముస్తాఫా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ విందులో మాజీ ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యుడు జంగా కృష్ణమూర్తి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక నమాజ్, అనంతరం ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. అల్లా చెప్పిన మార్గంలో ప్రతి ఒక్కరు పయనించాలని, ఆపదలో ఉన్న పేదలకు సాయం చేసేందుకు ముందుకు రావాలని జంగా కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జంగా సురేష్, పిడుగురాళ్ల జెడ్పీటీసీ జంగా వెంకటకోటయ్య, నాయకులు బెల్లంకొండ బద్రి, నర్రా పుల్లయ్య, షేక్ షరీఫ్, చింతపల్లి హస్సన్‌అహ్మద్, అబ్దుల్ రెహ్మాన్, బనాల శ్రీరాములు పాల్గొన్నారు.

పేదలకు దానధర్మాలు చేయాలి

చిలకలూరిపేట: రంజాన్ స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ పేదలకు దానధర్మాలు చేయాలని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారు. జనక్రాంతి పార్టీ అధ్యక్షుడు షేక్ గౌస్, జీఎస్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో టిడ్కో గృహ సముదాయంలో పేద ముస్లిం కుటుంబాలకు నిత్యావసరాలు శనివారం పంపిణీ చేశారు.